క్లుప్తంగా

ఎస్ఐకి సన్మానం

తలకొండపల్లి: ఎస్ఐ శ్రీనును కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంఘం కన్వీనర్ అశోక్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. తలకొండపల్లి మండల నూతన ఎస్ఐగా శ్రీను ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఎస్ఐని అశోక్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కృష్ణ, చంద్రశేఖర్, సురేశ్‌గౌడ్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఉప్పల వెంకటేశ్



మంత్రి కేటీఆర్‌ను కలిసిన వెంకటేశ్

తలకొండపల్లి: మంత్రి కేటీఆర్‌ను మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా వెంకటేశ్ నియమితులైన విషయం తెలిసిందే. శనివారం ప్రగతిభవన్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

కడ్తాల్: మండల పరిధిలోని గానుగుమార్లతండాలో బతుకమ్మ చీరలను జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ హంశ, ఉప సర్పంచ్ శారద, నాయకులు మోత్యానాయక్, పాండునాయక్, సేవ్యానాయక్, గోపి తదితరులు ఉన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: తెలంగాణ రాష్ట్ర ఆత్మ గౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, మహిళలు ఎంతో ఉత్సాహంతో జరుపుకునే ఈ పండుగకు కొత్త చీరలు కట్టుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రతి ఏటా చీరలను పంపిణీ చేస్తున్నారని పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని 8వ వార్డు కౌన్సిలర్ మాధవి తెలిపారు. శనివారం వార్డు కార్యాలయం వద్ద మహిళలకు బతుకమ్మ చీరెలను ఆమె పంపిణీ చేశారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

తుర్కయంజాల్: మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ, వైస్ చైర్‌పర్సన్ హరిత అనుచరులతో కలిసి బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ రమావత్ కల్యాణ్ నాయక్‌పై దాడికి పాల్పడటం హేయమైన చర్య అని బంజారా వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిషన్ సింగ్, శ్రీనివాస్ అన్నారు. శనివారం సాగర్ రహదారిపై చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అనురాధ, హరిత బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మకట్‌లాల్, శంకర్ నాయక్, మోహన్ నాయక్, రెడ్యా నాయక్, లాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ బస్సు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇబ్రహీంపట్నంకు చెందిన ఆకుల శ్రీనివాస్(52) మార్నింగ్ వాకింగ్ చేసేందుకు తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా యాచారం నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ప్రైవేట్ బస్సు ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయం తగిలి స్పృహ కోల్పోయాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న శ్రీనివాస్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి బలవన్మరణం

- వేధింపులు తాళలేక ఆత్మహత్య
- సూసైడ్ నోట్ లభ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీకి చెందిన నీరుడి వెంకటేశ్‌కు ఇద్దరు కుమార్తెలు. చిరు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే చిన్న కుమార్తె శ్రీవాణి డిగ్రీ వరకు చదివి ఇంట్లోనే ఉంటుంది. వ్యాపారంలో ఫోన్ పే ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆమె తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ఇంటికి ఎదురుగా ఉన్న సాయి అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. శ్రీవాణిని సాయి నమ్మించి ఫోన్ పే ద్వారా ఆమె వద్ద నుంచి రూ.10 లక్షల వరకు తీసుకున్నాడు. పెళ్లి కోసం బ్యాంక్‌లో జమ చేసిన డబ్బులు కావాలని తల్లిదండ్రులు, ఆమెను అడిగారు. దీంతో సాయిపై డబ్బులు కావాలని ఒత్తిడి పెంచింది. అతను డబ్బులు ఇవ్వకుండా బాధితురాలిని మానసికంగా వేధించాడు. వేధింపులు తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులకు ఆమె వద్ద సూసైడ్ నోట్ లభ్యమైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఎదురు చూపులు..!

- మార్కెట్ల ఏర్పాటు కలేనా?
- దళారుల చేతుల్లో నష్టపోతున్న అన్నదాత
- అధిక ధరలతో వినియోగదారుడి జేబుకు చిల్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి



రోడ్డు పక్కనే మాంసం దుకాణాలు

యాచారం: మాల్, యాచారం కేంద్రాల్లో కూరగాయల మార్కెట్ల ఏర్పాటు కలగానే మిగిలింది. మార్కెట్లను నిర్మించే ఉద్దేశం మార్కెటింగ్ శాఖ అధికారులకు ఉందా? లేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాల నుంచి విజ్ఞప్తి చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని అటు రైతులు, ఇటు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు ప్రతి యేటా రూ. లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశమున్న అధికారులకు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. మరోవైపు కూరగాయలు పండిస్తున్న రైతులకు మార్కెట్ల వసతి లేకపోవడంతో దళారుల చేతుల్లో మోసపోతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం, మాల్ కేంద్రాలు వ్యాపారపరంగా దినదినాభివద్ధి చెందుతున్నాయి. వ్యాపారాలు జోరుగా సాగడంతో రూ. లక్షల్లో ఆర్థిక లావాదేవీలు సాగుతున్నాయి. వేగంగా అభివద్ధి చెందుతున్న కేంద్రాల్లో కూరగాయల మార్కెట్ల ఏర్పాటు చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోకపోవడం రైతులకు శాపంగా మారింది.

శిథిలావస్థలో దుకాణాలు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎనిమిదేళ్ల క్రితం మాల్ మార్కెట్‌ను వ్యాపార పరంగా విస్తరించాలని రూ.25 లక్షల నిధులతో నల్లవెల్లి చౌరాస్తాలో దుకాణ సముదాయాన్ని నిర్మించారు. 25 మంది వ్యాపారులు లీజుకు తీసుకుని కొన్నాళ్ల పాటు కూరగాయల క్రయ, విక్రయాలు కొనసాగించారు. అయితే రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న మాల్ కూరగాయల మార్కెట్‌కు యాచారం మండల రైతులు మినహా.. నల్గొండ జిల్లాలోని చింతపల్లి, మర్రిగూడ తదితర గ్రామాల రైతులు రాకపోవడంతో వ్యాపారాలు సాగడం లేదని దుకాణాలను ఖాళీ చేసి నల్గొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని శ్రీ వెంకటేశ్వరనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోకి మారారు. దీంతో మాల్‌లో ఉన్న దుకాణాలు మూతపడ్డాయి. నేడు శిథిలావస్థకు చేరుకోవడం వలన రూ. 25 లక్షల నిధులు నిరుపయోగంగా మారాయి.

రోడ్లపైనే వ్యాపారాలు

మాల్, యాచారం కేంద్రాల్లో మార్కెట్ల సౌకర్యం లేకపోవడంతో వ్యాపారులు రోడ్ల పైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. రద్దీ వలన ట్రాఫిక్ జాం అవుతోంది. మాల్ చౌరస్తాలో మాంసం వ్యాపారులు రోడ్డుపై గొర్రెలు, మేకలను కోయడంతో పాటు చికెన్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్ స్థలంలోకి మాంసం దుకాణాలు ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇబ్బందులు పడుతున్నాం



మాల్ కేంద్రంలో కూరగాయల మార్కెట్ లేక ఇబ్బందులు పడుతున్నాం. రెండేళ్లుగా మార్కెట్ మూతపడింది. పట్టించుకునే వారే లేరు. పండించిన కూరగాయలను దళారులను విక్రయించి మోసపోతున్నాం.

– శంకర్‌నాయక్, రైతు, కేసీతండా

ఒకే చోట విక్రయాలు జరపాలి



నిరుపయోగంగా మారిన కూరగాయల మార్కెట్‌కు వాడుకలోకి తీసుకురావాలి. మాంసం విక్రయాలు కూడ అక్కడే జరపాలి. రోడ్డు పక్కన మాంసం విక్రయాలు జరపడం వల్ల పరిశుభ్రత లేకుండా పోతుంది. వ్యాపారులు కూడ ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు, మాంసం, చికెన్, చేపల మార్కెట్లు ఏర్పాటు చేయాలి.

– యాదయ్యగౌడ్, నల్లవెల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లా



సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని పలుమార్లు ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశాను. పశువుల సంతకు కూడ స్థలం లేక ప్రైవేట్ వెంచర్లలో ప్రతి మంగళవారం సంతను నిర్వహిస్తున్నాం. దీంతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమీకృత మార్కెట్ కోసం కృషి చేయాలి.

– పడకంటి కవిత, సర్పంచ్, మాల్

పోరు ‘వంట’

- కనీస వేతనం, బిల్లులు చెల్లించాలని డిమాండ్
- ప్రభుత్వ పాఠశాలల్లో వెలగని పొయ్యి
- కొనసాగుతున్న కార్మికుల సమ్మె



ఇబ్రహీంపట్నంలో..



మంచాలలో..

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ.. సంవత్సరాలు గడుస్తున్నా అమలు కావడం లేదని, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు దిగారు. ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పద్మ, సత్తమ్మ, శంకరమ్మ, ఈశ్వరమ్మ, సుగుణమ్మ, ఆశమ్మ, రాములమ్మ, అలివేలు, గిరిజ, పెంటమ్మ, ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

యాచారం: మధ్యాహ్న భోజన కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం పదో రోజుకు చేరింది. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కేసీఆర్ సర్కార్ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనంపెట్టాలని చెబుతోంది. కానీ ప్రతి నెల బిల్లులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని అన్నారు. అందుకే సమ్మెకు దిగినట్లు తెలిపారు. వీరికి మద్దతుగా సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, చందు నాయక్‌లు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన సిబ్బంది

కానిస్టేబుల్ అభ్యర్థులకు సన్మానం

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌కు చెందిన 10 మంది యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కానిస్టేబుల్ అభ్యర్థులను సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, సర్పంచ్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

మంచాల: మంచాల మండల పరిధిలోని తిప్పాయి గూడ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని సర్పంచ్ పాండు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అండాలు, సురేశ్, వీరేశ్ గౌడ్, చిరంజీవి, రాములు, రఘునందన్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శనివారం కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. పరామర్శించిన వారిలో హన్మానాయక్, శ్రీను ఉన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ అన్నారు. శనివారం పలు వార్డుల్లో కౌన్సిలర్లతో కలిసి ఆమె అభివృద్ధి పనులను ప్రారంభించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మంగమ్మ, ఉదయశ్రీ,, అనురాధ, హరిత తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ సీఐగా శివప్రసాద్ బాధ్యతలు

కడ్తాల్: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న శివప్రసాద్ కడ్తాల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన శివప్రసాద్‌కు పలువురు ప్రజాప్రతినిధులు, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

మద్యం బాటిళ్లు లభ్యం.. కేసు నమోదు

తలకొండపల్లి: ఓ కిరాణం షాపుపై పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని గట్టు ఇప్పలపల్లిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుఇప్పలపల్లిలోని ఓ కిరాణ దుకాణంపై పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేశారు. రెండు బీరు కాటన్లు, 15 క్వార్టర్లు, రెండు ఫుల్ బాటిళ్లు లభ్యమయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఇంటింటికీ కాంగ్రెస్



తాళ్లపల్లిగూడ గ్రామంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: అధిష్టానం నిర్ణయం మేరకు మంచాల మండలంలోని తాళ్లపల్లిగూడ గ్రామంలో ఇంటింటికీ కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ హస్తం గుర్తుకు ఓటు వేసి.. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మహిపాల్, నాయకులు గురునాథ్‌రెడ్డి, పాండు రంగారెడ్డి, రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, కుమార్, గణేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ



మాట్లాడుతున్న వెంకటస్వామి

ఇబ్రహీంపట్నం: అధికారమే లక్ష్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అమలుకాని హామీలను ఇస్తున్నాయని టీసీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి విమర్శించారు. తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఈ మూడు పార్టీలు ప్రజలను మోసగించి అధికారంలోకి రావాలనుకుంటున్నాయని, ప్రజలు ఆ పార్టీల ఎత్తుగడలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, హామీలకు నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచాయన్నారు. అవినీతి ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీసీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధవరెడ్డి, శేఖర్, నరేందర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

జెడ్పీటీసీ నిత్య



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నామని జెడ్పీటీసీ నిత్య ప్రకటించారు. శనివారం మంచాల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచాల మండల అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. మంచాల గ్రామంలో డ్వాక్రా భవనం నిర్మాణం కోసం జిల్లా పరిషత్ నుంచి రూ.10లక్షలు, పీడీఎఫ్ నిధులు, ఎమ్మెల్యే సహకారంతో మరో రూ.10లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగన్‌రెడ్డి, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, వార్డు సభ్యులు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలతో ఎమ్మెల్యే బిజీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ. 3.5 కోట్ల నిధులతో చేపట్టిన, చేపట్టబోయే పనులకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాయపోల్ గ్రామంలో రూ. 50 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా రూ.15 లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి, రూ. 10 లక్షలతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముకునూర్ గ్రామంలో రూ. 55.20 లక్షలతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్, రైతు వేదిక కంపౌండ్ వాల్, దండుమైలారంలో రూ. 30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, నెర్రపల్లి గ్రామంలో రూ. 22 లక్షలతో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్, నిర్మాణానికి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన ఎమ్మెల్యే చేశారు. అనంతరం బతుకమ్మ చీరలను, క్రీడాకారులకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పంచాయతీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు

పల్లెలు, తండాలకు స్వచ్ఛమైన తాగునీరు

- బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి
- కేసీఆర్ కృషితో మిషన్ భగీరథ పథకానికి రూపకల్పన
- ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



మిషన్‌భగీరథ నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కడ్తాల్: మిషన్ భగీరథ పథకం ద్వారా, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పల్లెకు, తండాకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా జరుగుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని సాయిరాంనగర్ కాలనీలో రూ.42లక్షలతో నిర్మించిన మిషన్ భగీరథ నీటి ట్యాంకును శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటి కోసం మహిళలు అనేక ఇక్కట్లకు గురయ్యేవారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషితో మిషన్ భగీరథ పథకానికి రూపకల్పన చేసి, గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెవెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ, అర్జున్‌రావు, వీరయ్య, నర్సింహ, మహేశ్, నర్సింహగౌడ్, దీఈ మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని ఆదివారం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెను చేపడుతున్నట్లు సంఘం కన్వీనర్ ఎల్లేశ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెల్లిస్తున్నట్లుగానే మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ. 21వేల వేతనం ఇచ్చి, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి యాదయ్య, మున్సిపల్ కార్మికులు రాజు, సురేశ్, రాములు, భాగ్య, స్వప్న పాల్గొన్నారు.

‘ఆశ’ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్

ఇబ్రహీంపట్నం: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్ డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నంలో నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం రూ. 18 వేలు, ప్రమాదబీమా రూ. 5లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని, లేనిపక్షంలో సోమవారం చలో హెల్త్ కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, నాయకులు బుగ్గరాములు, ఎల్లేశ్, మరియమ్మ, చంద్రకళ, సుకన్య, మణేమ్మ, లావణ్య, లలిత, ముక్తాబాయ్, స్వరూప, బాలమణిలు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. ఎంపీడీఓ సమావేశం హాల్‌లో శనివారం వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉందని, త్వరగా పనులు చేయాలని సూచించారు. గ్రామాల్లో విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకునే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. డ్రైనేజీ కాల్వలు, తాగునీటి పైపులు లీకేజీలు కాకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య పాల్గొన్నారు.